**ప్రముఖ సినీ నటుడు నటరాజ్‌కు ఆరోగ్యం ఏమీ బాగాలేదు. మద్రాసులో పేరు గాంచిన ఓ పెద్ద హాస్పిటల్లో స్పెషల్ రూమ్‌లో ట్రీట్‌మెంటు జరుగుతోంది.**

**అతడి భార్య రాధాదేవి కంటికి రెప్పలా కాపాడుతూ అతన్నంటి పెట్టుకునుంటోంది. పత్రికా ప్రతినిధులూ, ప్రొడ్యూసర్లూ, కళాకారులూ, అభిమానులూ వచ్చి అతని ఆరోగ్యపరిస్థితి తెలుసుకుని పరామర్శించి వెళ్తున్నారు.**

# ఆహా చిత్రం బళారే విచిత్రం!

కామినేని కృష్ణకుమారి

పెద్ద పెద్ద డాక్టర్లంతా పరీక్షించుతున్నా అతని రోగమేమిటో అంతు తెలియడం లేదు. చూస్తుండగానే పదిరోజుల్లో అతని ఆరోగ్యపరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. అతను పూర్తిగా కోమాలో వుంటున్నాడు. ఎలాంటి మందూ పని చెయ్యనందున ఇంక లాభం లేదని డాక్టర్లు పెదవి విరచి ఇంటికి తీసుకువెళ్ళమన్నారు.

అంబులెన్సులో ఇంటికి తీసుకువచ్చి రెండవ అంతస్థులో వున్న గదిలో పడుకోబెట్టారు. రాధాదేవి దుఃఖం వర్ణనాతీతం. అతనికున్న కొద్దిపాటి బంధువర్గానికి కబురు చేశారు. రాధాదేవి తరఫు బంధువులెవరూ పెద్దగా లేకపోవడం. వున్న ఒక్క తండ్రే ఆమె నంటిపెట్టుకునుండటంతో ఆమెకు ధైర్యం చెప్పి ఓదార్చగలుగుతున్నాడు.

* * *


నాలుగు రోజులుగా కోమాలో వున్న నటరాజ్ అనుకోకుండా తెలివిలో కొచ్చాడు. కాళ్ళూ, చేతులూ కదిలిస్తూ మెల్లగా కళ్ళు తెరిచాడు. ఓ నిముషంవరకూ చీకటిగా వుండి. తరువాత మసక. మసకగా వుండి. మెల్లమెల్లగా వెలుగు కనిపించింది. ఆ వెలుగులో ఆతృతగా తనవంకే గుచ్చి చూస్తున్న నాలుగు ముఖాలు కనిపించాయి. అతను ఆ ముఖాలను ఒక్కొక్కటి గుర్తించగలుగుతున్నాడు. మొదటి ముఖం తన భార్య రాధాదేవిది. రెండవ ముఖం ఆమె తండ్రిది. మూడో ముఖం పనిమనిషి పంకజం. నాలుగో ముఖం డాక్టర్‌ది. డాక్టర్ ముఖం చూస్తూనే అతను తృళ్ళిపడి ఒక్కవుదుటున లేవాలనుకున్నాడు. కానీ అవయవాలేవీ స్వాధీనంలో లేవు. గొంతువిచ్చుకుని పెద్దగా అరవాలనుకున్నాడు. కానీ నాలుక బంధబారిపోయి. పెదవులు మొద్దుబారి స్వరం బయటకు రావడం లేదు. మంచం మీద నుంచి లేచి ఏదో చెయ్యాలన్న తపనతో కొట్టుకుంటున్నాడు గాని ఏమీ చెయ్యలేక పోతున్నాడు. నిస్సహాయంగా డాక్టర్ ముఖంలోకి చూశాడు. ఆ చూపులో అర్థం చేసుకోగలిగితే ఎన్నో అర్థాలు గోచరిస్తాయి. కానీ అర్థం చేసుకోవలసిన అవసరం ఆ డాక్టరుకులేదు. అతను డబ్బు మనిషి. ఒప్పందం ప్రకారం వైద్యం చేయడం. డబ్బు తీసుకోవటం అదే అతని ధ్యేయం. అందుకే అతని చూపుకు ఏ మాత్రం విలువలేదు. బాటిల్‌లోని మందు సిరంజీలోకి ఎక్కిస్తున్నాడు.

నటరాజ్ తన చూపును డాక్టర్ ముఖం నుంచితప్పించి భార్య ముఖంలోకిచూశాడు. "భర్తే సర్వస్వం అనుకోవాల్సిన స్త్రీవి. నీకిది తగునా?" అన్నట్లు దీనంగా వుందా చూపు. రాధాదేవి నిర్లక్ష్యంగా అతనివంక చూసి "మీ అభిప్రాయాన్ని నేనంగీకరించను. భర్త అనేవాడు ఏ వయసులోనైనా దొరుకుతాడు. కానీ తారాపథంలో వెలుగొందాలంటే అవకాశాలు ఎప్పుడు పడితే అప్పుడురావు. అందుకే నాపాట్లేవో నేను పడుతున్నాను". తన చూపుతోనే అతనికి స్ఫురించేలా తెలియజేసింది. ఆ రాక్షసిని వేడుకోవడం వృధా అనుకున్న నటరాజ్ ప్రక్కనేవున్న పంకజం ముఖంలోకి చూశాడు. అంతే. వెంటనే షాక్ కొట్టినట్టు తన చూపును మరల్చుకున్నాడు. తను ఎంత తెలివిగా వ్యవహరించినా చిన్న పొరపాటువలన ఈనాడిలా మృత్యుముఖాన నిలబడి పోరాడవలసివచ్చింది. ఆనాడా చిన్న పొరపాటును చక్క దిద్దుకుని వుంటే ఈ నాటీ పరిస్థితి రాకపోను. ఏం చెయ్యాలి? ఇంకా చెయ్యడానికేముంది? జీవితం ఆఖరిమెట్టు మీద నిలబడినాక చావు తప్పించి మరో శరణ్యమేలేదు. నటుడిగా తనకెంత పేరు ప్రతిష్ఠలున్నా. కొన్ని లక్షల డబ్బు వుండీ అసహాయుడిగా వీళ్ళ చేతిలో చిక్కిపోయాడు. రజనీని శాశ్వతంగాఒదిలించుకున్నా నాడు. ఆమెకథ శాశ్వతంగా సమాధయ్యిందనుకున్నాడు గాని, తన కథ ఇలా తయారవుతుందని ఊహించనైనా లేదు. ఊహించి వుంటే పంకజం ఈ నిముషాన ఇక్కడ వుండేది కాదు.

* * *

నటరాజ్ చిత్రరంగంలో ప్రవేశించి సైడ్‌హీరోగా నటిస్తూ నాలుగేళ్ళు గడిపాడు. ఓ డైరెక్టర్ దయతలచి అతన్ని ఓపిక్చర్‌లో హీరోగాబుక్ చేశాడు. ప్రముఖ నటి రజని హీరోయిన్‌గా అతనితో ఆ పిక్చర్‌లో నటిస్తోంది. పిక్చర్ సగం పూర్తయ్యేసరికి వారిద్దరి నటనను పత్రికలు ప్రశంసిస్తూ రాశాయి. పరిశ్రమలోని ప్రముఖులంతా వారి నటనను గురించి ప్రశంసిస్తూంటే వారి మధ్య ప్రేమ అంకురించి పిక్చర్ పూర్తయ్యేసరికి ఇరువురూ పెళ్ళికూడా చేసుకున్నారు.

మూడేళ్ళ వైవాహికజీవితం ముచ్చటగా గడిచింది. ఈలోగా. రజనీకి మంచిపాత్రలు లభించడం. నటిగా తారాపథంలో వెలిగిపోవడం. ప్రతి ప్రొడ్యూసరూ తన పిక్చర్‌లో ఆమెనే బుక్ చేసుకోవడంతో క్షణం తీరికలేక ఆమె భర్తను. భర్తగా చూసే అవకాశం లేకపోయింది. అది నటరాజ్‌కు సుతరామూ నచ్చలేదు. పైగా ఆమె తల్లి ఇంట్లో తిష్టవేసుకు కూర్చుని రజనీ వద్ద డబ్బుతీసుకుని తన ఇతర కూతుళ్ళకు కొడుకులకూ పంపుతుంటే. అదేమని అడిగితే రజనీ "నా డబ్బే కదా పంపేది— నీ డబ్బు కాదుగదా?" అని మొండిగా సమాధానం చెప్పడం. అది అలుసుగా తీసుకొని అత్తగారు తనమీద పెత్తనం చెలాయించ




టం. నటుడిగా తనకు మంచి అవకాశాలు రాకపోవడం. భర్తగా రజనీముందుదిగ జారిపోవడంతో రజనీమీద వున్న ప్రేమంతా ద్వేషంగా మారిపోయింది. రజనీ ఇరవై రోజులు ఔట్‌డోర్ షూటింగ్ కోసం తల్లిని తీసుకువెళ్ళింది. ఇంట్లో వంటరిగా కూర్చుని ఎడతెరిపి లేకుండా ఆలోచిస్తున్నాడు. రజనీని ఈ లోకం నుంచి ఎలా పంపించాలా? అని.

పంకజాన్ని పనిమనిషిగా తమ వూరు నుంచి రజనీ తల్లి తీసుకొచ్చింది. భార్యాభర్తలిద్దరూ వున్నప్పుడు ఇరువురూ ప్రొద్దున లేచి స్టూడియోలకు పోగానే పంకజానికి వున్న పనేదో చేసుకుని తన ఇష్టం వచ్చినట్టు తిని ఇంటి మనిషికంటే ఎక్కువగా అధికారం చెలాయిస్తూ వుండేది. రజనీ తల్లి వచ్చి తిష్టవేసుకు కూర్చుని పంకజానికి వూపిరాడనంతగా పని చెబుతూ ఇల్లంతా తిరగనివ్వక ఒక ప్రక్కనపడి వుండమనేసరికి స్వర్గంలో నుంచి నరకంలో పడినట్లు అనిపించింది. నటరాజ్ లేనప్పుడు తల్లీ కూతుళ్ళు చెప్పుకున్న విషయాలన్నీ అతనికి చెప్పి అతని వద్ద మంచిని సంపాదించింది. అతని వద్ద ఆమె నుంచి ఎంతగా పెరిగిందో భార్యా. భర్తల మధ్య దూరం కూడ అంతగా పెరిగిపోయింది.

అలాంటి ట్రీట్‌మెంటు చేసే డాక్టరున్నాడని ఎప్పుడో ఎక్కడో ఎవరో చెప్పుకోగా విని ఎంతో ప్రయాసపడి ఆ డాక్టర్ను పట్టుకుని ఒప్పందం కుదుర్చుకున్నాడు.

రజనీ షూటింగ్ నుంచి తిరిగొచ్చి, సీజను మార్పు వలన జలుబుచేసి ఓరోజు పడకేసింది. ఆ డాక్టర్ను తీసుకొచ్చి ట్రీట్‌మెంటు ఇప్పించాడు. రజనీ తీవ్రమైన అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను హాస్పిటల్లో జాయిన్ చేశారు. పదిహేను రోజులు ట్రీట్‌మెంటు జరిగినా ఫలితం లేకపోయింది. రజనీ మరణించింది. పత్రికలన్నీ కామెర్ల రోగంతో రజనీ మరణించిందని ప్రకటించాయి. అలా రజనీని శాశ్వతంగా ఒదిలించుకుని తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. తనకు కుడిభుజంగా పని చేసిన పంకజానికి అయిదువేలు రూపాయలిచ్చి తనింట్లోనే పనిచేస్తూ వుండిపొమ్మన్నాడు. అదే అతను చేసిన పొరబాటు.

* * *

ప్రొడ్యూసర్ల కాళ్ళూ వేళ్ళూ పడి ప్రతి మూలి మంచి వేషాలు సంపాదించి హీరోగా నిలదొక్కుకున్నాడు. అప్పటికే రాధాదేవికి మంచి నటిగా పేరుంది. ఓ పిక్చర్‌లో అతనితో కలిసి నటిస్తూ అతనిపై ప్రేమను పెంచుకుంది. అతనూ ఆమెను ప్రేమించాడు కానీ "నటిగా విరమిస్తే భార్యగా స్వీకరిస్తా"నని కండీషన్ పెట్టాడు. అప్పటికే ఆమె చాలా పిక్చర్లలో బుక్కై వుంది. దాదాపు యాభై లక్షల రూపాయలు వచ్చే వేషాలన్నీ వదులుకుని అతన్ని పెళ్ళాడి గృహిణిగా మారిపోయింది.

పంకజం అణుకువతో చెప్పినట్టు నమ్మకంగా పని చెయ్యడంతో రాధాదేవి పంకజాన్ని బాగానే చూసుకునేది. భర్త అనురాగం. ఆప్యాయతతో మునిగి తేలుతూ భర్తే తన సర్వస్వం. ఇల్లే స్వర్గం అనుకుని రాధాదేవి ఇంటిని చక్కగా తీర్చిదిద్దుకుంది. హాయి. ఆనందం మిళితంకాగా ఓ ఏడాది గడిచిపోయింది.

నటరాజ్‌కు భార్య అనురాగం పూర్తిగా లభించినా. ఆమె మళ్ళీ నటిస్తానని అంటుందేమో? అమె అలా అనకుండా ముందు పిల్లల్ని కనేస్తే వాళ్ళ లాలనలో ఆమె నటనని పూర్తిగా మర్చిపోతుందన్న ఉద్దేశంతో తనకు పిల్లలంటే ఇష్టమని పదే పదే వ్యక్తం చెయ్యసాగాడు. "మీ ప్రేమానురాగంలో నన్ను మరికొంతకాలం మునిగి తేలనివ్వండి. ఇప్పటినుంచే పిల్లలెందుకు?" అంది రాధాదేవి. అయినా అతను పట్టు వదలలేదు. సమయం వచ్చినప్పుడల్లా ఆ విషయం ఆమెకు చెబుతూనే వున్నాడు.

ఓ రోజు పంకజం అన్నీ అందించగా వంటచేస్తున్న రాధాదేవి భర్త పిల్లల కోసం తొందరిస్తున్నాడని. తనే జాప్యం చేస్తున్నానని. అయినా అతను వినడం లేదని చెప్పింది.

వారిద్దరి అన్యోన్యత చూసి ఎక్కడ తనకు ఉద్వాసన చెబుతారోనని అణిగి. మణిగి మసులుకునేది. అప్పుడు వారిద్దరి మధ్య గాలి కూడా దూరేసందు లేదు. ఇప్పుడు పంకజానికి వేలుపెట్టే సందు దొరికింది. అందుకే దానిని చక్కగా ఉపయోగించుకుంది.

"మీరిలాగే అందంగా వుంటే మళ్ళీ నటిస్తానంటారేమోనని అయ్యగారికి భయమేమోనమ్మా? అందుకే పిల్లలు. పిల్లలంటున్నారేమో?" అంది.

"ఛ! నేను నటించడమనేది జరగనిపని. ఆయనకు పిల్లలంటే ప్రాణం. అందుకే అలా అంటున్నారు" అంది తేలిగ్గా. పంకజం పైకి నవ్వేసింది. కానీ లోపల 'ఓయబ్బో ఈ పట్టుదల ఎన్నాళ్ళు? నాలుగు రోజులాగితే ఈ సంబరం ఏమిటో నేను చూడకపోతానా?' అనుకుంది.

వంట పని కాగానే పంకజాన్ని బట్టలు ఉతకమని. తను బెడ్ రూమ్‌లో డబుల్ కాట్ మీద పడుకుని పత్రిక తిరగెయ్యసాగింది. అనుకోకుండా ఆమె మనసులో 'తను మళ్ళీ నటిస్తేనో?' అన్న ఊహ కలిగింది. ఉహూ! తను అన్నీ ఒదిలేసుకుని. చక్కటి గృహిణిగా మారిపోయింది. ఇందులో వున్న సుఖం. సంతోషం అందులో ఎక్కడిది? ఆ రొంపిలో దిగితే డబ్బు తప్పించి మరొకటేముంది? ఆ డబ్బు తన భర్త పుష్కలంగా సంపాదిస్తున్నాడుగా? ఇంకా తనకు తక్కువేంటి? అనుకుంది.

ఇంతలో ఆమె తండ్రి వచ్చి "అమ్మా నాకో వెయ్యి రూపాయలివ్వమ్మా" అని అడిగాడు. రాధాదేవిలేచి తండ్రికి డబ్బిచ్చి "వంటయింది భోజనం చేసెయ్యనాన్నా" అంది. అతను కూర్చోగానే వడ్డించింది. అతను భోజనం చేస్తూ దగ్గుతుంటే "తాగడం కొద్ది కొద్దిగా తగ్గించుకో నాన్నా! నీ ఆరోగ్యం పూర్తిగా పాడై పోతోంది." అంది రాధాదేవి. "మీ అమ్మలేని బ్రతుకు నాకో బ్రతుకుగా లేదమ్మా. ఆమెను త్వరగా చేరుకోవాలనే వేవిలా తాగుతున్నానమ్మా" అన్నాడతను. బాధతో మాట్లాడలేకపోయింది. తన చిన్నప్పుడు తల్లీ, తండ్రీ ఎంత అన్యోన్యంగా వుండే వారు? తన నెంతగా ప్రేమగా చూసేవారు? కానీ మాయరోగం అమ్మను గుల్లచేసింది. నయం చేయించడానికి నాన్న దగ్గర డబ్బులేదు. అందుకే అమ్మచచ్చిపోయింది. ఆ బాధను మర్చిపోలేక నాన్న తాగడం అలవాటు చేసుకున్నాడు. తను లేకపోతే నాన్న ఏమైపోయేవాడు?

కష్టసుఖాలలో పాలు పంచుకునేది పిల్లలే నన్న నటరాజ్ మాటలు నిజమేననిపించినా ఇంత త్వరలో కనడం ఎందుకో ఇష్టం అనిపించడం లేదు. భోజనం చేసి ఆమె తండ్రి వెళ్ళిపోయాడు.


కానీ ఆమె మనసు పిల్లల్ని కనాలా. వద్దా అని ఆలోచిస్తూనే వుంది. ఒక్కోసారి ఈ నాలుగు గోడల మధ్య ఇలా వుండే కంటే మళ్ళీ నటిస్తేనో అనుకుంటుంది. ఇదీ. అదీ అన్నది తేలక కొంతకాలం గడిచింది.

ఈ మధ్య అద్దంలో చూసుకుంటే తన అందం తనకే వింతగా కనబడుతోంది. తెలుగు ప్రజల గుండెల్లో ఆరాధింపబడిన ఈ అందం కేవలం భర్త ఒక్కడికే అంకితమవ్వాలా? ఈ సంసారమనే దావిలో

## పంట

వాడి పుస్తకాలు
 అద్దాల గదుల్లో చూచి
నీ గ్రంథాలు
రోడ్డుపక్క
మట్టిలో వున్నాయని దిగులు పడకు!
నిజం ఎప్పుడూ
నేలమీదే వుంటుంది.
ఋతువును బట్టి
మళ్ళీ మొలకెత్తటానికి.

—రావి రంగారావు



ఏముంది? భర్త. పిల్లలు— వాళ్ళ పెంపకం. దీనితో ఈ అందం హరించుకుపోవడం. ఎన్నాళ్ళున్నా ఇంతేకదా? కారనైతే పలు రకాల పాత్రలు పోషిస్తూ ప్రజల మనసులో మరపురాని ముద్రవేస్తూ. ప్రశంసలు, సన్మానాలు ఓహ్ ఒకటేమిటి సర్వం లభ్యమవుతాయి. ఇదా, అదా అన్నది ఆమె ఆలోచనల్లో తేలటంలేదు.

ఓ రోజు మాటల సందర్భంలో భర్తతో అంది. "ఏమండీ ఇంట్లో ఏమీ తోచడం లేదు. నాకు మళ్ళీ నటించాలని వుంది" అంది. అది విన్న నటరాజ్ పక్కలో బాంబు పేలినట్లుగా అదిరిపడ్డాడు. "నువ్వు నటించడం నాకిష్టం లేదు" సూటిగానే అన్నాడు. అలా ఆ విషయంలో ఇరువురికీ అభిప్రాయ భేదం వచ్చి వాదన జరిగింది. అయినా నటరాజ్ నటించడానికి వీల్లేదన్నాడు. అతనెంతగా ఒద్దంటున్నాడో ఆమెకంతగా పట్టుదల పెరిగింది. పంకజానికి చేతినిండా పని తగిలింది.

ఫలితంగా ఎడమొగం. పెడమొగాలతో ఇరువురి మధ్య మాటలు కరువయి దూరం పెరిగింది.

ఆ రోజు నటరాజ్ స్నానానికి నీళ్ళు పెడుతూ పంకజం "అయ్యగారూ! ఈరోజు ప్రొడ్యూసర్లు వచ్చి అమ్మగారితో చాలా సేపు మాట్లాడి వెళ్ళారు"నిమెల్లగా చెప్పింది. అది విన్న నటరాజ్‌లోని కోపం బుస్సున పొంగింది. వాళ్ళతో ఏం మాట్లాడిందో తెలుసుకోవాలని రాధాదేవితో వాదన పెట్టుకున్నాడు. రాధాదేవి అసలు సంగతి చెప్పక మొండిగా సమాధానం చెప్పేసరికి, అతని కోపం తారస్థాయి నందుకోగా ఆమె మీద చెయ్యి చేసుకున్నాడు.

ఎర్రగా కందిపోయి వాతలు తేలిన చెంపల్ని అద్దంలో చూసుకున్న రాధాదేవికి భర్తంటే విపరీతమైన అసహ్యం కలిగింది. అతన్ని సాధించటానికయినా తను మళ్ళీ నటించి తీరాలనుకుంది కసిగా. కానీ లోగడ పత్రికల వారికి, ప్రొడ్యూసర్లకూ కూడా నటిగా విరమించుకుని గృహిణిగా మారిపోయానని సంసారం చక్కదిద్దుకోవడంతప్పించి ఇంక జీవితంలో నటించనని స్టేట్‌మెంట్లిచ్చింది. ఇప్పుడు మళ్ళీ నటిస్తానంటే పత్రికలతో పాటు ప్రేక్షకులు కూడ దుమ్మెత్తి పోస్తారు. ఏడాది తిరిగే సరికి ఏమైందంటూ. అందుకే ఏం చెయ్యాలా అని ఎడతెరిపి లేకుండా ఆలోచిస్తుంటే అనుక్షణం ఆమె మనసులోని భావాలను గమనిస్తున్న పంకజం దుఃఖిస్తున్న రాధాదేవిని తన అనునయ వాక్యాలతో మనసుకు హత్తుకునేలా ఓదార్చి "మీకేమమ్మా కుందనపు బొమ్మలాగున్నారు. మీరు 'ఊ' అంటే సినీ ప్రపంచమంతా వచ్చి నీ కాళ్ళ ముందు వాలుతుంది. మొగుడయినంత మాత్రాన ఇంతగా హింసిస్తుంటే ఎంతకని సహిస్తారు? బంగారంలాంటి భవిష్యత్ ముందుంచుకుని ఇలా మీలో మీరే కుమిలిపోవడం చూస్తే నాకెంతో బాధగా వుంది'. ప్రొడ్యూసరుగారికి ఫోన్ చేసి నటిస్తానని చెప్పెయ్యండి" అంది.

"ఆనాడలా నటించనని ప్రగల్భాలు పలికి, ఈనాడు నటిస్తానని ఎలా చెప్పమంటా"వంది రాధాదేవి. అప్పుడు పంకజం రజనీని నటరాజ్ ఎలా అడ్డు తొలగించుకున్నాడో చెప్పి, నీ దారికి అడ్డుగా వున్న అతన్ని నువ్వూ అదే పద్ధతిలో తొలగించుకోమని చక్కటి సలహా చెప్పింది.

దానితో రాధాదేవి కంటికి పంకజం ఆపదలో ఆదుకునే దేవతలా కనిపించింది. ఇరువురూ బాగా ఆలోచించి చక్కటి ప్లాన్ తయారుచేసుకున్నారు. ఆడాక్టరునుపంకజం గుర్తుపట్టగలనని చెప్పింది. నటరాజ్ వారంరోజులు అవుట్‌డోర్ షూటింగ్ కెళ్ళగానే పంకజాన్ని కారెక్కించుకుని మద్రాసు నగరమంతా తిప్పింది. మనసుంటే మార్గమనేది లేకపోతుందా? డాక్టర్ దొరకటం అయిదు లక్షలిచ్చి ఒప్పందం కుదుర్చుకోవడం. నటరాజ్ ఇంటికి రాగానే అతన్ని అస్వస్థతకు గురిచెయ్యడం, చకచకా జరిగిపోయాయి.

డాక్టరిచ్చిన ఇంజక్షన్ పనిచెయ్యటంతో నటరాజ్ తన ఆఖరి శ్వాస ఎంతో సేపు లేదని తెలుసుకుని మనసారా ఇష్టదైవాన్ని వేడుకున్నాడు.

* * *

ప్రముఖ సినీ నటుడు నటరాజ్ అస్తమించడం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమ పరచింది. పత్రికలన్నీ ఎంతో ప్రశంసిస్తూ రాశాయి. ఇక ప్రేక్షకుల బాధ వర్ణనాతీతమే అయింది. అవన్నీ చదివిన రాధాదేవి తేలిగ్గా వూపిరి పీల్చుకుంది.

తనకంతగా సహాయపడిన పంకజం చేతిలో పాతికవేలు పెట్టి "నీరుణం తీర్చుకోలేనిది. మీ ఇంటికెళ్ళి ఈ డబ్బు భద్రపర్చుకుని, తిరిగిరా!" అంటూ వెంటనే ప్రయాణం చేసింది. పంకజం ఆనందానికి అవధులు లేవు.

పాతికవేలు పుచ్చుకుని ట్రెయిన్‌లో ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తున్న పంకజం తనతెలివికి తానే మురిసిపోతోంది. కానీ తన మృత్యువు రాధాదేవి తండ్రి రూపంలో తన ప్రక్క కంపార్ట్‌మెంటులోనే వున్నాడని తెలియదు.

అర్ధరాత్రి ట్రెయిన్ ఓ బ్రిడ్జి మీద నుంచి వెళ్తుంటే నిద్రపోతున్న పంకజాన్ని డోర్ తెరిచి గబుక్కున నీళ్ళల్లోకి తోసి పాతికవేలూ తెచ్చి కూతురుకిచ్చాడతను.

డబ్బు ఇచ్చిన తండ్రిని చూడగానే రాధాదేవి మనసులో తళుక్కున ఓఆలోచన మెరిసింది. పంకజం నటరాజ్ రహస్యం తనకు చెప్పినట్లే ఒకనాటికి తన రహస్యం తన తండ్రి.... చెప్పవచ్చన్న ఊహ రాగానే ఆమె గుండె జల్లుమంది. వెంటనే ఆలోచించి పథకం తయారు చేసుకుంది. ఉదయం లేచేసరికి తప్పతాగి ఆమె తండ్రి చచ్చిపడి వున్నాడు. అతని అంత్యక్రియలు పూర్తిచేసి అప్పుడు ప్రకటించింది రాధాదేవి.

'తనకు నా అన్నవారెవరూ లేనందున మళ్ళీ నటిస్తా'నని. మర్నాడుదయం ఆమె ఇంటిముందు ఇరవై దాకా కార్లు వచ్చి ఆగినై.

